www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 10 | జనవరి | 2026

పేజీలు : 8

## విస్తృత ప్రచారం.. జన సమీకరణే లక్ష్యం




-12న ట్రాక్టర్ ర్యాలీ.. కవి సమ్మేళనం

-13న ముగ్గుల పోటీలు

-14న ఇంటింటిపై సిపిఐ జెండా

-సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ శత వసంత ముగింపు సభ జయప్రదానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సభకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. భారీ జన సమీకరణే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్

మిగతా 2లో..

## 12న నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ

### -అతిథిగా హాజరుకానున్న సుద్దాల అశోక్‌తేజ, కూనంనేని




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక కవితా సంచిక నూరేళ్ల అరుణ కేతనంను ఈనెల 12న ఆవిష్కరించనున్నట్లు కమిటీ బాధ్యులు లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. కవితా సంచిక ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ప్రముఖ అభ్యుదయ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారని లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. కవితా సంచిక ఆవిష్కరణకు సంబంధించి శుక్రవారం ఏఐటియుసి కార్యాలయంలో శింగు నర్సింహారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని అభ్యుదయ రచయితల నుంచి రచనలను ఆహ్వానించామని వంద మంది

మిగతా 2లో..

## మధిర పట్టణాన్ని అభివృద్ధి చేసిన వారినే గెలిపించుకోవాలి : భట్టి



**ప్రజాపక్షం/మధిర :** కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఈ దేశంలో ఇంకో పార్టీ పుట్టేదే కాదు, మరోపార్టీకి భవిష్యత్ ఉండేది కాదని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లిలో కాంగ్రెస్ కీలక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఇతర పార్టీలు రెండు మూడు దశాబ్దాల క్రితం చేసిన ఐదులక్షల పనిని మైకు దొరికిన ప్రతిసారి చెప్పుకుంటూ పోతారు, కాని కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం వెనుకంజలో ఉండటం మూలంగా ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. మధిర మున్సిపాల్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మధిర నగరానికి వచ్చిన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచితంగా ఆర్టిసి బస్సు ప్రయాణం వంటి

మిగతా 2లో..

## సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం



### -దేశానికే ఆదర్శంగా ఆయిల్‌ఫామ్ సాగు

### -రైతు మేళాలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడమే రాజకీయ జీవిత కోరికని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గర్వంగా ప్రకటించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో జరిగిన రైతు మేళా కార్యక్రమంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునప్రారంభం సేంద్రియ వ్యవసాయ పథకం ప్రారంభ కార్యక్రమాలను ప్రారంభించి మంత్రి తుమ్మల మాట్లాడుతూ మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టిఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు జగిందన్నారు. వ్యవసాయ విద్యలో ఉత్తమ కళాశాలగా నిలవాలని

మిగతా 2లో..

## ప్రజాపాలన లక్ష్యం అభివృద్ధి, సంక్షేమం



### -మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన లక్ష్యమని అభివృద్ధి సంక్షేమమని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ అభివృద్ధిని, సంక్షేమాన్ని కొనసాగించడాన్ని గర్వంగా చెప్పుకుంటామని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ గత ప్రభుత్వంలో విడతల వారీగా బ్యాంకులకు జమ చేయగా అది వడ్డీకి కూడా సరిపోలేదని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకకాలంలో 2లక్షల రూపాయల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి మహిళలకు చేయూతని ఇవ్వడంతో పాటు ఆర్టీసీని బలోపేతం చేశామని ఈ ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఉచిత విద్యుత్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖలను నిర్వీర్యం చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల కారణంగా రాష్ట్రం ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అనేక రంగాలలో వెనుకబడి ఉన్నామని, ఈ దశలో రాష్ట్రానికి ముఖ్య మంత్రి అయిన రేవంత్రెడ్డి ఆర్థిక స్థితిగతులను గాడిన పెడుతూ గతంలో జరిగిన తప్పిదాలను సరి చేస్తూ ప్రజలకు

మిగతా 2లో..

# మధిర పట్టణాన్ని అభివృద్ధి చేసిన వారినే గెలిపించుకోవాలి : భట్టి

(మొదటిపేజీ తరువాయి)

పథకాలు ప్రతి నాయకుడు రోజు పదిమందికి వివరిస్తే చాలని సూచించారు. మధిర పట్టణం అభివృద్ధి చెందాలి క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంటేనే భవిష్యత్ తరాలు బాగుపడతాయని ఆలోచించే వ్యక్తులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మధిర పట్టణానికి కాంగ్రెస్ చేయని పని అంటూ లేదు అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్, చెరువులను టూరిజం పార్కులుగా తీర్చిదిద్దడం, డిగ్రీ, ఇంటర్ హైస్కూల్ విద్యాసంస్థలకు సొంత భవనాలు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, జనరల్ పాలిటెక్నిక్, ఐటిఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మార్చడం, బస్టాండ్, ట్రెజరీ బ్యాంకులను తీసుకురావడం వంటి గొప్ప పనులు చేసామని మున్సిపాలిటీలోని ఓటర్లకు వివరించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఒక మంచి ఇల్లు కట్టాలి అనుకున్నప్పుడు మొదట సిమెంట్, కంకర, ఇటుకలు ఎక్కడపడితే అక్కడ ఉంటాయి చిందరవందరగా కన్పిస్తుందని కాని ఇల్లు పూర్తయిన తర్వాత అందంగా కన్పిస్తుందని అదే తరహాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రస్తుతం జరుగుతున్నాయని, అది పూర్తయితే నగరం సుందరంగా మారుతుందని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన చోట మట్టిని పూడ్చాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత మధిర పట్టణంలో మొత్తంగా కొత్త సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. మధిర మున్సిపాల్టీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అభివృద్ధి పనులు జరిగితే మధిర పట్టణం అభివృద్ధి చెందుతుందని, తద్వారా భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని వివరించారు. ఈసమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

(మొదటిపేజీ తరువాయి)



ఆకాంక్షించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడమే తన రాజకీయ జీవిత కోరికన్నారు. గత ప్రభుత్వంలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డిపిఆర్‌లో లేదని, ఈ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశారన్నారు. నాల్గో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట అశ్వారావుపేట మండలాలకు గోదావరి నీళ్లు అందుతాయన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కోకో జాజి వక్క మిరియం సాగుతో రైతులకు అదనపు లాభాలు వస్తాయన్నారు. దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉండాలన్నారు. తెలంగాణలో పదిలక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం పట్టుదలగా ఉందన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సంక్రాంతి పండుగ రోజు ఉంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తారని మంత్రి తుమ్మల వెల్లడించారు. 2047 నాటికి 470బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యంగా ఉందన్నారు. పామాయిల్ సాగుతో రైతులుకు మహర్దశ పట్టనుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ మంత్రిగా మాట ఇస్తున్నా సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తామనిన స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి అసమర్థత వల్ల సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం చేయలేదని, నిబంధనలకు విరుద్ధంగా బ్యారేజ్‌లో నీళ్లు నిల్వ చేసి కాళేశ్వరం కూలిందని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరక సీతారామ ప్రాజెక్టుకు 67టిఎంసిలు గోదావరి జలాలు కేటాంపు సాధించామని మంత్రి తెలిపారు.. వ్యవసాయ యాంత్రీకరణ పథకం, సేంద్రీయ వ్యవసాయం దిశగా ప్రభుత్వం కార్యాచరణతో ఉన్నట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి రైతులు దశాబ్దాల సాగునీటి కల సాకారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రంగా రాఘవరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం విసిలు జానయ్య, రాజిరెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేందర్ మోహన్ పాల్గొన్నారు.

# విస్తృత ప్రచారం.. జన సమీకరణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

భవన్‌లో కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాగం మాట్లాడుతూ జనవరి 18న జరిగే చారిత్రిక సభకు భారీ ఎత్తున జన సమీకరణే లక్ష్యంగా గ్రామ గ్రామాన ఇంటింటా సిపిఐ మహాసభ ప్రచారాన్ని చేరవేయాలని ఆయన తెలిపారు. 10వ తేదీ నుంచి 17 వరకు సిపిఐ కార్యాచరణను కార్యవర్గ సమావేశంలో హేమంతరావు ప్రకటించారు. ఈనెల 10న అలంకరణ కమిటీ సమావేశంతో పాటు ఆయా కమిటీల బాధ్యుల సమావేశం జరుగుతుందని తెలిపారు. 11న ఖమ్మం నగరంతో పాటు ప్రధాన కేంద్రాల్లో కాగడాల ప్రదర్శన జరుగుతుందన్నారు. 12న బహిరంగ సభ జయప్రదం కోరుతూ ట్రాక్టర్ ర్యాలీ, పతంగులు, బెలూన్ల ఏర్పాటు నిర్వహించడం జరుగుతుందని హేమంతరావు తెలిపారు. అదే రోజు స్థానిక డిపిఆర్‌సి భవనంలో కవి సమ్మేళనం జరుగుతుందని ఈ సమ్మేళనానికి ప్రముఖ సినీ, రచయిత సుద్దాల అశోక్‌తేజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు కెవిఎల్, పల్లేరు వీరస్వామి, రాపోలు సుదర్శన్ లతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవులు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. 13న ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తమ ఇండ్లపై సిపిఐ జెండాలను ఆవిష్కరించాలని ఆయన కోరారు.14న గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఇందులో జాతీయ మహిళా సమాఖ్యతో పాటు యువజన విద్యార్థి సంఘాలు కూడా పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఇప్పటికే ఐదువేల మందికి జనసేవా దళ్ శిక్షణ ఇవ్వడం జరిగిందని మరో రెండు రోజుల్లో మరి కొంత మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే తొలి దఫా ప్రచారం పూర్తయిందని మండలాల్లో మలిదశ ప్రచారం ప్రారంభమైందన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో జరిగిన ప్రధాన ఘట్టాలను తెలియజేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది సభకు హాజరవుతున్నందున బహిరంగ సభకు సంబంధించి నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఎల్‌ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం నలువైపులా నుంచి నాలుగు ప్రదర్శనల ద్వారా సభా స్థలాకి చేరుకుంటారని పెవిలియన్ మైదానం నుంచి వేలాది మంది జనసేవా దళ్ కార్యకర్తల కవాతు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, అజ్మీరా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మద్యంబాబులను దోచుకుంటున్న మద్యం సిండికేట్ వ్యాపారులు

**- బెల్టు షాపుల్లో అధిక ధరలకు అన్ని బ్రాండ్ల మద్యం అమ్మకాలు**
**- చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. పొద్దుందాక కాయ కష్టం చేసుకుని వచ్చిన కూలీ డబ్బులతో మద్యానికే అధిక మొత్తంలో ఖర్చు చేస్తూ కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. రోజువారి కూలీలు అధిక ధరకు మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని మొత్తం ఐదు షాపులు ఉండగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులకు అధిక రేటుకు మద్యాన్ని విక్రయిస్తూ ముందు కౌంటర్లల్లో ఎంఆర్‌పి అని చెప్పి కేవలం వాళ్లు కేటాయించిన మద్యం ఇస్తూ మద్యం ప్రియులకు అడిగిన మద్యాన్ని ఇవ్వకుండా దాట వేస్తున్నారు. పిండిప్రోలు, తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం, జూపెడ, సుబ్లేడు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో వైన్‌షాపులను నడుపుతూ ఐదు షాపులు లాటరీ పద్దతిలో పొందిన వైన్‌షాప్ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఐదు కౌంటర్ల పది కౌంటర్లు ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాల ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారు. మండలంలోని 40గ్రామపంచాయతీ పరిధిలో బెల్టు షాపులకు మద్యాన్ని అధిక రేటుకు విక్రయిస్తున్నారు. ముందుగా కౌంటర్లలో నామమాత్రంగా ఎమ్మార్పీ రేటికే విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ క్వార్టర్ అయినా ఎంఆర్‌పి ధరకు ఇవ్వాల్సింది ఉండగా ఎక్సైజ్ అధికారులు ముడుపులు పుచ్చుకుని మద్యం సిండికేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మద్యం షాపులపై పర్యవేక్షణ లేకపోవడం ఇదంతా జరుగుతుందని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా మద్యం షాపులపై పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

# 12న నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

కవులు తమ రచనలను పంపించారని పరిశీలన అనంతరం వాటిని అరుణ కేతనంలో ముద్రించడం జరిగిందన్నారు. 12న ఉదయం 10 గంటలకు ఖమ్మం డిపిఆర్‌సి భవనంలో కవి సమ్మేళనం జరుగుతుందని సమ్మేళనంలో పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నవచేతన విజ్ఞాన సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఖమ్మం జిల్లాకు చెందిన కవులు మువ్వా శ్రీనివాసరావు, రౌతు రవి, కొంపల్లి రామయ్య, రవి మారుత్, ప్రసేన్, సీతారామ్, ఐవి రమణారావు తదితరుల పాల్గొంటారని లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఐజెయు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజాపాలన లక్ష్యం అభివృద్ధి సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన అభివృద్ధి సంక్షేమం నిరాటకంగా అమలు చేస్తున్నారని అన్నారు. గత పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఏ విధంగా ఆదరించారో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అదే విధంగా ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు దొడ్డదానియల్, పులి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సాంబ, రాము, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి వేడుకలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో డిఓసి కరుణ శ్రీ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, ముగ్గుల పోటీలు నిర్వహించి, జనవరి 26న బహుమతులు అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సుందరంగా రంగురంగులతో విద్యార్థులు ముగ్గులను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కళాశాలకు మైక్‌సెట్ వితరణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భద్రాచలం వాహన తనిఖీ అధికారి లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం సభ్యులు సంఘం వెంకట పుల్లయ్య వారి తల్లిదండ్రులు శంభయ్య, తిరుపతమ్మ జ్ఞాపకార్థంగా ఆమ్ప్లిఫైర్ మౌత్ పీస్ లు వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కే శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, ప్రసన్న, పుల్లారావు, శ్రీరాములు, జ్యోతి, కళావతి, నాగరాణి ,రమాదేవి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి వీరభద్రం, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎక్స్‌లెంట్‌లో ఘనంగా సంక్రాంతి సంబురాలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఎక్స్‌లెంట్‌లో సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటాయి. సంప్రదాయ సంస్కృతి ప్రతిబింబించేలా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం పండుగ కళతో కళకళలాడింది. హరిదాసుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్దు వేషాల్లో చిన్నారులు అలరించారు. సంప్రదాయ పాటలు, నృత్యాలతో సందడి నెలకొంది, సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదారంగ నాయకుల కళ్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని రామాలయం ఆధ్వర్యంలో గోదారంగ నాయకుల కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను అంగరంగవైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులకు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం గ్రామంలోని పెద్దల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, గోదారంగనాయకుఉల కళ్యాణానికి అందరూ ఆహ్వానితులేనని ఆలయ నిర్వాహక కమిటీ వారు పేర్కొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల ప్రకారం చింతకాని మండలంలోని ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లకు చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్ ఆధ్వర్యంలో బిపి, షుగర్, కొలెస్ట్రాల్ మొదలగు పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లు మత్తుపదార్థాలు సేవించరాదని సూచించారు. పరీక్షలతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

**-ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షలు**
**-ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్షించిన అదనపు కలెక్టర్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 35188 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో 66 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ థియరీ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 67 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 21 వరకు ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్ష మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 21, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జనవరి 22న జరుగుతుందని, జనవరి 23న ఎథిక్స్ మానవ విలువలు, జనవరి 24న పర్యావరణ అవగాహనపై ఇంటర్నల్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సకాలంలో పరీక్షకు హాజరయ్యే విధంగా ఆర్టీసి బస్సులు పరీక్షా కేంద్రాల రూట్లలో స్పెషల్ బస్సులు నడపాలన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేవిధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇన్విజిరేటర్లుకు శిక్షణ అందించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాల లీకేజీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో పద్మశ్రీ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ, మున్సిపల్, పోస్టల్, పోలీస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాంబాయి మృతి సిపిఐకి తీరని లోటు

**-సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం**



**ప్రజాపక్షం/చింతకాని :** రాఘువాపురం గ్రామ సీపీఐ సీనియర్ నాయకురాలు కొత్తకొండ రాంబాయి(57) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు.విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు రాఘువాపురం చేరుకుని రాంబాయి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాంబాయి బతికినంత కాలం నిబద్దతగల కమ్యునిస్టుగా బ్రతికిందన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, శాఖ కార్యదర్శి కొల్లి రవి, నాయకులు సింగారపు సత్యనారాయణ, కొండపర్తి బాలాజి, కొల్లి బాబు, నారపోగు నాగార్జున, నక్కనబోయిన కృష్ణ, సీపీఎం నాయకులు దొబ్బల బాబు, వడ్లమాని రాంబాబు, కొత్తకొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

# సీతారావమ్మను పరామర్శించిన బాగం



**ప్రజాపక్షం/చింతకాని :** రాఘువాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటివద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు శుక్రవారం సీతారావమ్మనివాసానికి వెళ్ళి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటంబ సభ్యులను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు దొబ్బల వెంగళరావు, కొల్లి రవికుమార్, కొల్లి బాబు, వెంకటేశ్వర్లు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

**-పెట్రోల్ బంక్ నిర్వాహకులకు అవగాహన**
**-అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతా ప్రమాణాలపై శుక్రవారం పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఒక వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం పొందినా ఒక కుటుంబం దెబ్బతింటుందనాన్నరు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్‌కు కొద్ది దూరం నుంచి కర్వ్ ఉంటూ ప్రధాన రోడ్డు కలిపేవిధంగా అవసరమైన మార్పులు చేసుకోవాలని పెట్రోల్ బంక్ డీలర్లకు సూచించారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లకు దూరంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్ బంక్‌కు ఇరువైపులా 100 మీటర్ల దూరంలో రోడ్లపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెట్రోల్ బంక్‌లో పనిచేసే సిబ్బంది యూనిఫాం ద్వారా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడంపై ప్రచారం కల్పించాలన్నారు. పెట్రోల్




బంకుల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని, సిబ్బందికి సిపిఆర్ ట్రైనింగ్ అందించాలని దానికి అవసరమైన కార్యాచరణ తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 50 రోడ్లను గుర్తించి అక్కడ మున్సిపల్, ఆర్అండ్‌బి, నేషనల్ హైవే, రెవెన్యూ, రవాణా శాఖ సంయుక్తంగా పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టివో డి. జగదీష్, డిఎల్‌ఎంవో ప్రవీణ్‌కుమార్, ఆర్అండ్‌బి డిఈ జి. రాధిక, పౌర సరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డి. రామారావు హెచ్చరించారు. చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మీక తనిఖీ చేశారు.ఆరోగ్య కేంద్రంలోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఓపి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఔషదాలు సరైన సమయానికి వస్తున్నాయా, మందుల కొరత ఏమైనా ఉందా వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, వైద్యం పట్ల , విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. రికార్డులను పరిశిలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, సూపర్‌వైజర్లు వీరేందర్, కృష్ణారావు, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మా సర్వ్యాపం



**ప్రజాపక్షం/ మధిర :** అన్నం పరబ్రహ్మ సర్వ్యాపమని, అన్నిదానాల్లో కల్లా అన్నదానం మిన్న అని దాతలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దాత పల్లపోతు మనోజ్, రాహుల్ ఆర్థిక సాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లి రోజు తదితర సందర్భాల్లో పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేయాలని, అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, కుంచం కృష్ణారావు, దాచేపల్లి ముత్యాలు, చేడే రామకోటేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, భవిరిశెట్టి సాంబశివరావు, వేముల నవీన్‌కుమార్, కొల్లా శ్రీనివాసరావు, కొత్తమాసు రామారావు, సముద్రాల పాపారావు, దోకుపర్తి జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.

# వైరా రవాణా శాఖ యూనిట్ తరలింపు..?

**-బోనకల్‌లో కార్యాలయం ఏర్పాట్లు**
**-యూనిట్ తరలించవద్దంటున్న ప్రజలు**
**-ఆందోళనకు సిద్ధమైన సిపిఐ, సిపిఎం**




**ప్రజాపక్షం/వైరాః** వైరాలోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో బోనకల్‌కు తరలిస్తున్నారు. ఈ రవాణాశాఖ యూనిట్ కార్యాలయం వైరాలో 27.07.1998వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నేటి వరకు వైరాలోనే ఈ రవాణా కార్యాలయం కొనసాగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వైరాలో ఉన్న రవాణా కార్యాలయాన్ని బోనకల్‌కు అంచెలంచెలుగా తొలగించాలని ప్రతిపాదనలతో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే బోనకల్‌కు వైరాలోని రవాణాశాఖ యూనిట్ కార్యాలయాన్ని తొలగించాలని ఆదేశాలు సైతం ఇచ్చినట్లు సమాచారం. అయితే వారంలో రెండు రోజులు విధి నిర్వహణ అక్కడ కొనసాగించాలనే విధంగా జీవో కాపి కూడా ఇచ్చారన్నట్లు తెలుస్తుంది. అయితే ఒకే కార్యాలయం రెండు ప్రాంతాల్లో నిర్వహించడం కష్టం. ఈ ప్రాంతంలో ఉన్న ప్రమాణ యూనిట్ కార్యాలయం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్నిరకాల సౌకర్యాలను వైరాలో ఉన్నాయి. నిత్యం వందలాది బస్సులు వైరాకు వస్తూ పోతూ ఉంటాయి. అదే క్రమంలో వాహనదారులు కూడా వైరా వస్తున్నారు. పోతూ ఉంటారు. కాలినడకన ఆ కార్యాలయానికి వచ్చే వారు నేరుగా కార్యాలయం ముందునే దిగి కార్యాలయంలో పనులు చేసుకొని వెళ్లిపోయేంత సౌలభ్యత ఉంది. కాని ఏం జరిగిందో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పుడు వైరాలో ప్రజలను వెంటాడుతుంది. ఎందుకంటే ఎన్నో సంవత్సరాల నుంచి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న రవాణాశాఖ కార్యాలయాన్ని బోనకల్‌కు తరలించడం అంఏ ప్రజలను ఇబ్బందులు గురిచేసినట్టే. ఎందుకు అంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇటు ప్రభుత్వ ఉద్యోగులకైన అటు ప్రజలకైనా వాహనదారులకైనా అనువైన ప్రదేశంగా వైరాను అప్పట్లోనే ఎంపిక చేసి ఇక్కడ ఆర్‌టివో కార్యాలయం బోనకల్‌కు పంపించడం ఇప్పుడు పెద్ద రాజకీయ దుమారానికి తావిస్తుంది. ఇప్పటికే సిపిఎం, సిపిఐ పార్టీలు వైరాలోని రవాణా యూనిట్ కార్యాలయాన్ని తరలింపుపై ఆందోళన చేస్తున్నాయి. ప్రజలు కూడా వైరాలోనే రాజకీయాలకు అతీతంగా రవాణా యూనిట్ కార్యాలయం ఉండాలనే వాదనను బలంగా వినిపిస్తున్నారు.



# వైరా మున్సిపాలిటీ ఎన్నికల బరిలో సంతోష్



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో కాంగ్రేస్ పార్టీ ఆదేశిస్తే కట్ల సంతోష్ పోటీకి సై అంటున్నాడు. కాంగ్రేస్ పార్టీలో చురుకైన నాయకుడిగా యువకుడిగా ఉంటూ పార్టీ అడుగుజాడలోనే పార్టీ నిర్ణయం శిరోధార్యం అనే విధంగా ఉన్న కట్ల సంతోష్, వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో బరిలో నిలవనున్నాడు. పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుకు తమ్ముడు అయిన కట్ల సంతోష్ కుటుంబం కాంగ్రేస్ కుటుంబం, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కాంగ్రేస్ పార్టీలో కట్ల రంగారావు సారథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలోనే ఉన్నారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి కాంగ్రేస్ పార్టీని వదిలి బిజెపిలోకి వెళ్లినా కాని కట్ల కుటుంబం కాగ్రేస్‌లోనే ఉంది. పది సంవత్సరాల బిఆర్‌ఎస్ పాలనలో ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొన్న కట్ల కుటుంబం కాంగ్రేస్ పార్టీని మాత్రం వదలలేదు. ఇప్పుడు కాంగ్రేస్ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రేస్ పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన ప్రజలను మెచ్చుకుంటుంది. ఇన్ని సంవత్సరాలు పార్టీ కోసం పనిచేసిన కట్ల సంతోష్, మున్సిపాల్ ఎన్నికల బరిలో నిలవనున్నారు. పార్టీ ఆదేశిస్తే పోటీకి సై అంటున్నాడు సంతోష్, అయితే అధిష్టానం నిర్ణయమే మాకు శిరోధార్యమని కట్ల కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

## జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల కేంద్రంలో రైల్వే గేట్ సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు నిల్వ ఉన్న పత్తి 100 క్వింటా ల పైగా దగ్ధమైంది. సుమారు 10లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపన సిబ్బంది తీవ్రంగా ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, వ్యర్థాలు అడ్జస్ట్ ఫైపులో ఇరుక్కుపోవడం వల్ల కూడా అగ్ని ప్రమాద చెలరేగే అవకాశాలు లేకపోలేదని పలువురు రైతులు వాపోతున్నారు. షార్ట్ సర్క్యూట్ పేరుతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకునే అవకాశం కూడా ఉండటం వల్ల కారణాలు తప్పుదోవ పట్టించేందుకు యజమాన్యం ప్రయత్నిస్తున్నట్లు కార్మిక సంఘాలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎటువంటి రిపోర్టు ఇస్తారో వేచి చూడాలి.

## తానం రవీందర్ ఆశయాలు సాధించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: సిపిఎం మాజీ మండల కార్యదర్శి అమరజీవి తానం రవీందర్ ఆశయాలు సాధించాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రవీందర్ 5వ వర్ధంతి సందర్భంగా స్మారక స్తూపం వద్ద జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ రవీందర్ మండలంలో ఉన్న పీడిత ప్రజల తరుపున వారి సమస్యలు కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారని ముఖ్యంగా ఆనాటి ప్రభుత్వం పోడు సాగుదారులపై కక్ష్యపురితంగా వ్యవహరిస్తూ భూములు గుంజుకోవాలని చూసిన సమయాన వారి తరుపున అండగా ఉండి పేదల భూములను కాపాడినారని, ఈసందర్భంగా పలుమార్లు నెలల తరబడి జైలు జీవితం గడిపారని అన్నారు. ఇదే కాక అనేక సందర్భాలలో పేదలకు కష్టం వస్తే నేనున్నానని అండగా ఉండేవారని అన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రామూర్తి, సారయ్య, శ్రీరాములు, కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, వంశీ, గణప సాయిరాం, వెంకటమ్మ, హరినాథ్, పాల్గొన్నారు.

## అరుణోదయ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు



ప్రజాపక్షం/మణుగూరు: తెలుగు రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలతో కూడిన సంక్రాంతి పండుగను పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని విద్యార్థుల చేత రంగవల్లులు గాలిపటాలను ఎగరవేశారు. ఆటపాటలతో ఆదరించారు అనంతరం కరస్పాండెంట్ మాదాస్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పకృతి సమ్మేళనంతో కూడుకొని ఉన్నదని అన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను, రైతన్న తో కూడిన పండగ గొప్పతనాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి పండుగ సంబురాలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి వివరిస్తూ ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులు, వ్యవసాయదారుల కుటుంబంలో సంతోషించే కాలం ఈ సంక్రాంతి పండుగ సమయం అని, పెద్దల నుండి సాంప్రదాయకంగా వస్తున్న ఈ పండుగలను ప్రత్యేకంగా జరుపుకోవాలని, పూర్వ వైభవాలను తలపించే విధంగా ప్రతి కుటుంబంలో చేసుకోవాలని సాంప్రదాయాలను మరవద్దని, ప్రతి కుటుంబం పాడిపంటలతో, సుఖ సంతోషాలతో వర్ధిలాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైరాలోనే ఆర్‌టివో కార్యాలయాన్ని ఉంచాలి



ప్రజాపక్షం/వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం తరలింపు సరైంది కాదని, ఇక్కడే ఆ శాఖను ఉంచాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ వైరాలో ఎన్నో సంవత్సరాల నుండి ఆర్‌టివో కార్యాలయం నడుస్తున్నందని, వైరాకి చుట్టుప్రక్కల ఉన్న మండలాలు కొణిజర్ల, తల్లాడ, అలాగే బోనకల్, మధిర, ఎర్రుపాలెం తగు మండలాలకు కేంద్ర బిందువై వైరా సెంటర్‌గా కొనసాగుతూ ఉంది. ఆ కార్యాలయాన్ని ప్రభుత్వ అధికారులు తొలగించడం సరైంది కాదని, అన్ని మండలాలకు సెంటర్ పాయింట్‌గా ఉన్న వైరాలోని ఆర్‌టివో కార్యాలయాన్ని కొనసాగించాలని అన్నారు. ఇలా తరలించడం వలన వైరా, తల్లాడ, కొణిజర్ల మండలాల వాహనదారులకు అనేక ఇబ్బందులు కలుగుతాయని, ప్రజలు ఇబ్బంది కలగకుండా వైరాలో ఆర్‌టివో కార్యాలయాన్ని ఉంచాలని అన్నారు. తరలింపు ప్రతిపాదనలో మానుకోకపోతే పెద్ద ఎత్తున సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని గోపాలరావు తెలిపారు.

# రోజు రోజుకీ పెరుగుతున్న చలి తీవ్రత..!

**-వృద్ధులు, చిన్నారులపైనే తీవ్ర ప్రభావం**
**చలికి ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు**



ప్రజాపక్షం/జూలూరుపాడు: జిల్లా వ్యాప్తంగా చలి పులి చంపేస్తోంది. రాగల రోజుల్లో చలి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రతకి వృద్ధులు, చిన్న పిల్లలు అధికంగా ఆనా రోగ్యానికి గురవుతున్నారు. చలి అంటే అందరికీ సహజసిద్ధమైన ఋతువు. కానీ చల్లని గాలులు, ఉదయాన్నే కమ్మేసే పొగమంచు, రాత్రివేళల్లో చలికాలం తెచ్చే పణుకు ఇవన్నీ శరీరానికి కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా చలి కాలం ఆనందదాయక మైనదే అయినా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోకపోతే పులిలా దాడి చేసే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ సీజన్ను సరిగ్గా ఎదుర్కోవడం చాలా అవసరం. అయితే జూలూరుపాడు మండలం చుట్టూ అడవి ప్రాంతం కాబట్టి చుట్టుపక్కన పల్లెలో చలి తీవ్రత రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతిరోజు తెల్లవారు జామున పొగమంచు విపరీతంగా పడుతోంది. ఈ పొగ మంచుకి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ చలి తీవ్రతకి మండలంలోని గ్రామాల ప్రజలు బయటికి రావడం లేదు. వృద్ధులు, చిన్నారులు. మాత్రం అనారోగ్యబారిన పడుతున్నారు.

### వృద్ధులు, చిన్నారులపై అధిక ప్రభావం...

చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలపైనే అధిక ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉంది. వృద్ధులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలి ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోవడం వల్ల వారిలో శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, దమ్ము వంటి వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. చలికాలంలో బిగులైన, వేడిగా ఉంచే దుస్తులు. ధరించడం తప్పనిసరి. చిన్నపిల్లల్లో గురక, ఎగశ్వాస, జలుబు, డబ్బు వంటి లక్షణాలు. ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు.

### శ్వాసకోశ వ్యాధుల వారికి హెచ్చరిక...

అస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండకూడదు. బయటకు వెళ్లేటప్పుడు ముక్కు చెవులు, మీద కప్పుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తరచూ త్రాగడం, పొడి వాతావరణంలో తేమను నిలుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గోరువెచ్చని నీరు, వేడి ఆహారం తప్పనిసరిచలికాలంలో శరీరం వేడిని కోల్పోతుంది. అందుకే వేడి పానీయాలు, సూపులు, గోరు వెచ్చని నీరు తాగడం శరీర రక్షణకు ఉపకరిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కు వగా తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంద వైద్యులు తెలుపుతున్నారు.

# కమీషన్లకు కక్కుర్తిపడి కమల్‌రాజు అసత్య ప్రచారం



ప్రజాపక్షం/ మధిర : కమీషన్ల కోసం కక్కుర్తిపడి మధిర మున్సిపాల్టీని గ్రామస్థాయికి దిగజార్చిన లింగాల కమల్‌రాజు కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో మధిర మున్సిపాల్టీని గ్రామపంచాయతీ కన్నా అధ్వానంగా తయారు చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. మధిర మున్సిపాల్టీలో పది సంవత్సరాలు అధికారంలోకి ఉండి మధిర పట్టణానికి బిఆర్ఎస్ పార్టీ చేసిందని ఏమి లేదని, చేయని పనులను కూడా చేశామని చెప్పి బిల్లులు చేసుకున్న ఘనత బిఆర్ఎస్ పార్టీదని విమర్శించారు. ట్యాంక్ బండ్ నిర్మాణానికి అప్పటి కేంద్ర పర్యాటకమంత్రిగా ఉన్న చిరంజీవితో మాట్లాడి రూ.9కోట్లు మంజూరు చేయించింది మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అదేవిధంగా మధిర పట్టణంలో సెంట్రల్ లైటింగ్, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, ఇండోర్ స్టేడియం తదితర అభివృద్ధి కార్యక్రమాలు మధిర ఎమ్మెల్యేగా ఉన్న మల్లు భట్టివిక్రమార్క కృషితోనే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం డిప్యూటీసిఎంగా మల్లు భట్టివిక్రమార్క మధిర పట్టణాభివృద్ధికి పెద్దపీట వేసి కోట్లాది రూపాయలు మంజూరు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్న భట్టిపై ఉన్న అక్కుస్సుతోనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ అసత్య ప్రచారాలు మానుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కోరంపల్లి చంటి, షేక్.జహంగీర్, తలుపుల వెంకటేశ్వర్లు, మాగం ప్రసాద్, షేక్.రబ్బాని, నాగబోయిన రామారావు, సువర్ణకంటి రామకృష్ణ, సాలిక సురేష్, కర్నాటి శ్రీను పాల్గొన్నారు.

## సిపిఐ శత వసంతాల బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**



ప్రజాపక్షం/సత్తుపల్లి: భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టి వందేళ్లయిన సందర్భంగా వంద సంవత్సరాల ఉత్సవ ముగింపు సభ జనవరి 18న ఖమ్మంలో జరుగుతుందని. ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, తాటి వెంకటేశ్వరావు విజ్ఞప్తి చేశారు. శతవసంత బహిరంగ సభ పోస్టర్ ను శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దండు, తాటిలు మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని, దున్నేవాడికే భూమి కావాలని, ఉపాధి కోసం, విద్యార్థులకు విద్య కోసం, పీడిత తాడిత ప్రజల కనీస సౌకర్యాల కల్పన కోసం పోరాడి , ఎందరో అమరవీరుల త్యాగాలతో పునీతమైన జండా సిపిఐ జెండా అని వారు కొనియాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కంటక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావడానికి ఈ సభలు నిర్వహిస్తున్నట్లు రానున్న తరాలకు కమ్యూనిస్టు పోరాట చరిత్రను తెలియజేప్పి, భవిష్యత్ తరాలకు కమ్యూనిజం అందించడం కోసమే బహిరంగ సభ జరుగుతుందని బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా తో పాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆల్ ఇండియా కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఇంకా అతిరథ మహారథులు పాల్గొంటారని కావున ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుజ్జి శంకర్, మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, తాటి వీరభద్రం, తాటి కుమారి, తాటి రాజులు,నాగేంద్రరావు ,ధార రాజమ్మ ,పద్మ ,తాటి రాజమ్మ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారం సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారు ల సదస్సులో బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ గ్రామంలోని విద్యుత్ సమస్యలు తెలిపారు. దాదాపు 50 ఇళ్ల మీద నుంచి వెళుతున్న 11కేవీ విద్యుత్ లైన్ వేలాడుతున్న నేపథ్యంలో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవిస్తున్నట్లుగా ఆందోళన వ్యక్తం చేశారు.. గ్రామంలో 10 మిడిల్ పోల్స్ కావాలని, బీసీ కాలనీలో 100 ఇండ్లకు సంబంధించిన కేబుల్ వైర్ కాలిపోయిందని, ఎస్సీ కాలనీలో 200కు సంబంధించిన కేబుల్ వైరు పాడైపోయిందని, లాంగ్ సర్వీస్ లకు స్తంభాలు, వైరు ఇప్పించమని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఐదు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్లు కావాలని, గ్రామపంచాయతీలో త్రీఫేస్ సర్వీస్ లేక వృధాగా ఉన్న బోరుకు త్రీఫేస్ సర్వీస్ ఇప్పించాలని కోరారు. అందుకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# అతివేగంగా పోతున్న డాన్‌బాస్కో స్కూల్ బస్సులు..!

**-ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం**
**-పిల్లల ప్రాణాలకు పొంచి ఉన్న ప్రమాదం?**
**-చర్యలు చేపట్టకపోతే ప్రమాదమే జరగవచ్చు?**





ప్రజాపక్షం/వైరా: వైరా, తల్లాడ మండలాల సరిహద్దు ప్రాంతం అయినా స్టేజిపినపాక సమీపంలో ఉన్న తల్లాడ మండల పరిధిలోని డాన్‌బాస్కో స్కూల్ బస్సులు విద్యార్థులతో అతివేగంగా దూసుకుపోతున్నాయని చెప్పవచ్చును. ఒక పక్క బస్సు ప్రమాదాలతో అధికార యంతాంగం ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టేందుకు ముందుకు సాగుతూ ఉంటే డాన్‌బాస్కో బస్సులు మాత్రం అతివేగమే మాకు ముఖ్యం అనే విధంగా నడుస్తున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ నిర్వహణ లోపంలో పూర్తిగా విఫలమైపోతున్నారని చెప్పవచ్చును. బస్సులు మితిమీరి అతివేగంగా పోతున్నాయని చెప్పినా కూడా ఎలాంటి స్పందన లేకుండా ఉన్నారు. అంటే వారి పని విధానం ఏముందో ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలి. తమ పిల్లలు మంచిగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తుంటే పాఠశాలకు వచ్చే బస్సులు జాగ్రత్తగా రావాలి. బస్సుల పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో పూర్తిగా రక్షణ కూడా లేదని చెప్పవచ్చును. గత కొన్ని నెలల క్రితం పాఠశాలలో విద్యార్థులు చేత ఆవరణలో గడ్డి పీకించిన సందర్భాలు ఉన్నాయి. పిల్లల చదువు కోసం వస్తున్నారా పాఠశాలలో గడ్డి పీకడానికి వస్తున్నారా అనేది కూడా ఇప్పుడు తల్లిదండ్రులు పలువురు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తల్లాడ మండల పరిధిలో ఉన్న డాన్‌బాస్కో పాఠశాల నిర్వహణపై బస్సుల అతివేగంపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రమాదాలు జరిగితే నష్టపోయేది ఎవరు? ఒక్కసారి ఆలోచించండి. ప్రమాదాలు జరగకుండా ముందే చర్యలు చేపట్టండి. ప్రభుత్వ ఆదేశాలను కూడా ఈ పాఠశాల నిర్వాహకులు పాటించలేదని వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం విద్యాసంస్థ సెలవులో కూడా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నడిపిస్తూ బస్సులు అతివేగానికి కారణం అవుతున్నారు. ఇలాటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

### పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులు...

డాన్‌బాస్కో స్కూల్ బస్సుల్లో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కిస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పాఠశాల బస్సులో సీట్లకు సరిపోయే విధంగా బస్సులను విద్యార్థులను ట్రాన్స్‌పోర్ట్ చేయడానికి ఉపయోగించాలి. కాని ఈ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పిల్లలను పరిమితికి మించి బస్సుల్లో ఎక్కిస్తున్నారు. దీంతో చిన్న వయసులోని పిల్లలు బస్సుల్లో పుస్తకాల బ్యాగులతో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. పిల్లలకు ఎన్నో ఇబ్బందులు ఎన్నో ఇలాంటి వాటిపై కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని, రవాణాశాఖ ముఖ్యంగా దృష్టి సారించాలి.

# ఇన్ సర్వీస్ టీచర్ల టెట్, సిపిఎస్‌ను రద్దు చేయాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపులో భాగంగా యూఎస్పిసి, టిపిటిఎఫ్ పిలుపు మేరకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆళ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మర్కోడులో, ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ అనంతోగులో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020ను రద్దు చేయాలని, టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని నినదీస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సర్వీసు చేసిన ఉపాధ్యాయులకు ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రాసి రెండు సంవత్సరాలలో ఉత్తీర్ణులు కావాలని లేని యెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మెమొరాండాన్ని రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి సమర్పిస్తామని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 5న జరగబోయే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఈసం ముత్తయ్య, ప్రధానోపాధ్యాయులు చీమల భద్రమ్మ, మండల అధ్యక్షులు బి భోజ్యా, నాగమణి, మమతరాణీ, లీలావతి, పద్మబాయి, కృష్ణ, మోహన్ బాబు, రాంబాబు, లక్ష్మీ నారాయణ, లాలయ్య, రాంబాబు, అనుజ్ఞ, జ్యోతి, భద్రమ్మ, కొమరం వసంతరావు, రవీందర్ బాబు, లక్ష్మయ్య, నరేష్, రాజా, నెహ్రూ, రామయ్య, చిన్న శ్రీను, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అండగా వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్






ప్రజాపక్షం/వైరా: గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్, వైరా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వైరా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వైరా గ్రేట్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జాలా పుల్లారావు వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎస్సై రామారావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. చదువుతోపాటు సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిధిగా లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా విద్యారంగానికి తమవంతు సహకారం అందించడం గర్వంగా ఉందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ లయన్స్‌క్లబ్, పోలీస్‌శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు గ్రేట్ విజన్ భరోసా...

వైరాలోని గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ మరో ముందడుగు వేసి ఎక్కడ లేని విధంగా విద్యార్థుల భవిష్యత్తుకు గ్రేట్ విజన్ భరోసా కల్పించిందని చెప్పవచ్చును. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారి భవిత్తు విద్యను దృష్టిలో పెట్టుకొని విద్యకు సంబంధించిన మెటీరియల్ అందించడం అంటే అది గ్రేట్ విజన్ గొప్పతనం అనే చెప్పవచ్చును. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ లగడపాటి ప్రభాకర్‌రావు, విజన్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, జెడ్‌సి సిహెచ్.నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ తోటకూర శ్రీకాంత్, వుయ్యూరు రామకృష్ణ, ఎంఈవో వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతీ అక్షరం ప్రజల పక్షాన నిలవాలి



ప్రజాపక్షం/కారేపల్లి: ప్రజాపక్షం దిన పత్రికలో వచ్చే ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలబడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని టియూడబ్ల్యూ(ఐజేయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు తాత శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం సింగరేణి మండల కేంద్రంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈ రోజుల్లో ఆ విలువలను కాపాడే నిలువుటద్దంగా, అన్యాయాన్ని ప్రశ్నించే పత్రికగా ఈ ప్రజాపక్షం నిలవాలన్నారు. కొత్తపుంతలు తొక్కుతున్న మీడియా రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రజాపక్షం ప్రజల పత్రికగా పరిమిడిల్లాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కారేపల్లి ప్రజాపక్షం విలేకరి రాము, టియూడబ్ల్యూ(ఐజేయూ) మండల అధ్యక్షులు ఏపూరి లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి కొత్తూరి శ్రీనివాసరావు, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, బానోత్ బాలు, తెల్ల శ్రీనివాసరావు, గుగులోత్ కళ్యాణ్, సురేష్, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలిచే పత్రిక ప్రజాపక్షం



ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రజాపక్షం దినపత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ మణిధర్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో నాలుగో స్తంభమైన జర్నలిజం వృత్తిని ఎన్నుకున్న విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో నూతన చైతన్యాన్ని రేకెత్తించే విధంగా, పాఠకుల మనసు దోచే విధంగా వార్త కథనాలు ప్రచురించడంలో మీడియాకు మాత్రమే సాధ్యమని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడంలో ప్రజాపక్షం దినపత్రిక కృషి అభినందనీయమని నిజాలను వెలికి తీయటంలో నిష్పక్షిపాతంగా పని చేస్తూ అందరి మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం మండల దిన పత్రిక విలేఖరి గోపినాథ్‌ను ప్రత్యేకించి అభినందిస్తున్నామని అన్నారు. అనంతరం తహసీల్దార్ మణిధర్‌ను అశ్వాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రజాపక్షం దినపత్రిక ప్రతినిధులు, స్థానిక పాత్రికేయులు, మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్‌లో మొదలైన సంక్రాంతి సంబరాలు





ప్రజాపక్షం/బూర్గంపాడు: స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల నందు సంక్రాంతి పండుగ పురస్కరించుకొని బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్, కోకో కోలా కంపెనీ వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 80 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన రంగవల్లులు సంస్కృతి సంప్రదాయాలకు మేళ వంపుగా నిలిచి చూపరులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ ముందుగా అందరికీ సంక్రాంతికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి అంటే సూర్యుడు ధరస్సు రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశించడం, ప్రకృతికి సూర్య భగవానునికి కృతజ్ఞతలు చెప్పే పండుగ అని, రైతులు కష్టించి పండించిన ధాన్యం ఇంటికి తెచ్చి పొంగళ్ళు చేసి సూర్యుడికి నైవేద్యంగా సమర్పించడం వ్యవసాయం, ప్రకృతి, కోడి పందాలు, పిల్లలకు రేగు పళ్ళు పోయడం వంటి కుటుంబ సంప్రదాయాల సమ్మేళనంతో తెలుగువారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే పండుగ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలను నిర్వహించడం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆనాటి కాలం నుండి ఆడపడుచులు రంగ వల్లులు వేసి మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందినటువంటి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల హెడ్ మిస్సెస్ స్వర్ణకుమారి, కోకో కోలా కంపెనీ ఆర్గనైజర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ముగ్గుల పోటీలు



ప్రజాపక్షం/కారేపల్లి: మోకాళ్ళగుంపు ప్రాథమిక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు అజ్మీరా వీరు నాయక్ ఆధ్వర్యంలో సంక్రాం తి సందర్భంఆ బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు సత్యనారాయణ, మహిళలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

**-క్రికెట్ పోటీలను ప్రారంభించిన బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని 14, 15 డివిజన్ కొత్తగూడెంలో పగడాల బసవయ్య, పగడాల భరత్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి మామిడి తోట వద్ద ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పగడాల బసవయ్య, పగడాల భరత్ కుమార్ ల జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో గత 21 ఏళ్లుగా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. సిపిఐ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరుగుతుందని యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. నిర్వాహకులు పగడాల మల్లేష్ మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంటులో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 20వేలు, ద్వితీయ బహుమతి రూ. 10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు



అందజేయనున్నట్లు మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, రేసు వెంకన్న, సిపిఐ కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, మత్స్య సొసైటీ అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, నాయకులు బుడిగె వెంకన్న, పోతురాజు వెంకటేశ్వర్లు, మాకనబోయిన నాగేశ్వరరావు, తుపాకుల శ్రీకాంత్, లింగం సూరి, భూమా ఉపేందర్, కోలా సైదులు తదితరులు పాల్గొన్నారు.

# హాల్ మార్క్‌కు 15 మంది విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రపంచ అంతర్జాతీయ సంస్థ హాల్ మార్క్ నిర్వహించిన ప్రాంగణ నియమాకాల్లో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం హాల్ మార్క్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియమాకాల్లో 15 మంది విద్యార్థులు ప్రతిభ చూపి మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లుగా ఎంపికైనట్లు తెలిపారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతూ ఖమ్మం ఐటి హబ్‌లో సేవలు అందిస్తున్న హాల్ మార్క్ సంస్థలో తమ విద్యార్థులు వారధిగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో 15 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలల శిక్షణలో రూ. 2.20 లక్షలు వేతనం ఇస్తారని అనంతరం మూడు లక్షల వరకు వార్షిక ఆదాయం పొందుతారన్నారు. ఎంబిఏ, ఎంసిఏ, బిటెక్‌కు చెందిన వివిధ విభాగాల వారు ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ హాల్ మార్క్ సంస్థలో తమ కళాశాల



విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు పోటీగా ఖమ్మంలో తమ కళాశాల విద్యార్థులు ప్లేస్‌మెంట్లు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాల్ మార్క్ సీనియర్ హెచ్ఆర్ అల్లూరి ప్రశాంతి, డి. శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో సిఎం కప్-2026 టార్చ్ ర్యాలీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సీఎం కప్ 2026 క్రీడా పోటీల్లో భాగంగా మండలంలో క్రీడా టార్చ్ ర్యాలీను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మట్టా రాగమయి దయానంద్ క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం

**గ్రామీణ స్థాయి ప్రతిభను వెలుగు తీసేందుకు సీఎం కప్ కీలకం : ఎమ్మెల్యే రాగమయి**

తరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీయడంలో సీఎం కప్ కీలకమని, యువత క్రీడల్లో ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే సీఎం కప్ పోటీల్లో గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు. ఈ ర్యాలీ సత్తుపల్లి ప్రాంతంలో క్రీడా ఉత్సాహాన్ని పెంచిందని జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పున్న సత్యనారాయణ, ఎండిఓ నాగేశ్వరరావు ఎంఈఓ, రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, సోందు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి పిఏసిఎస్‌లో ఆకస్మిక తనిఖీ

**రైతులకు సేవలు విస్తరించాలని ఆదేశం**
**రాష్ట్ర వ్యవసాయ అనుబంధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్)ను రాష్ట్ర వ్యవసాయ అనుబంధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వలు, కొనుగోలు,అమ్మకాల వివరాలు, ఈపిఓఎస్, భౌతిక నిల్వలను పరిశీలించిన అనంతరం రైతులతో ముఖాముఖీగా యూరియా వినియోగంపై చర్చించారు. అనంతరం సత్తుపల్లి డిసిసిబి బ్రాంచ్‌ను సందర్శించి పంట, పాడి గేదెలు, గృహ రుణాలపై బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించి, భవిష్యత్తులో సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు విస్తరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధనపు



సంచాలకులు కె. విజయ్ కుమార్,డిసిఓజి గంగాధర్, బ్యాంకు సిఈ.ఓఎస్ వెంకట ఆధిత్య, ఏడిఏ వి. శ్రీనివాసరెడ్డి, ఏడి. వై .శ్రీనివాసరావు, డిసిసిబి మేనెజర్ జె. కిషోర్ కుమార్ పిఏసిఎస్ సిఈఓ సిహెచ్. వీరస్వామి,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**-పాఠశాలను సందర్శించిన ఏఎంవో**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పాఠశాల సందర్శనలో భాగంగా శుక్రవారం కామంచికల్ లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి, మూడు, ఐదు తరగతుల విద్యార్థుల అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. ఈసిఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు తెలంగాణ విద్యా పరిశోధన శిక్షణా మండలి వారు పంపించిన తెలుగు, హిందీ, ఇంగ్లీష్ అభ్యాస దీపికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, యాదగిరి, రఘుకుమార్, దుర్గ, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శకుంతలమ్మకు నివాళులర్పించిన యుగంధర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చింతగుర్తి మాజీ సర్పంచ్ మెంటెం రామారావు మాతృమూర్తి మెంటెం శకుంతలమ్మ గురువారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ సంతాపం తెలిపారు. శుక్రవారం చింతగుర్తి గ్రామంలో వారి స్వగృహంకు వెళ్లి శకుంతలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ ఛైర్మెన్లు తాతా రఘురాం, రావూరి సైదబాబు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు, కేతినేని సీతారామయ్య, కొత్తా కొరమయ్య, సూదగాని గోపయ్య, బాతుల సుధాకర్, కె. రమేష్ తదితరులు నివాళులర్పించారు.

# పోలీసు స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల (పోలీసు స్కూల్)లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. శనివారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా పాఠశాలలో ఈ సబురాలు జరిగాయి. పాఠశాల చైర్‌పర్సన్ నిష్టా శర్మ సర్యవేక్షణలో ఏఆర్ అడిషనల్ డిసిపి కుమారస్వామి విద్యార్థులతో కలిసి భోగిమంటలు వెలింగించి సంబురాలను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాల దుస్తులతో అలరించారు. రంగవల్లులు, భోగిమంటల నడుమ ఉత్సాహంగా సంబురాలు సాగాయి. ఈకార్యక్రమంలో ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాజు, అధ్యపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధి లోని గణేశ్వరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని తెలుగు సాంప్రదాయాలకు అనుగుణంగా ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అంగన్‌వాడీ టీచర్ కౌసల్య రాధ వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాషా, ఎల్. గోపాలరావు, ఎన్. వెంకటేశ్వర్లు, ఎ. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శత వసంతాల సభకు తరలిరండి

**-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**



**ప్రజాపక్షం/బోనకల్:** భారత కమ్యూనిస్టు పార్టీ కలకోట శాఖ ఆధ్వర్యంలో శతవసంతాల ఉత్సవ ముగింపు సభకు తరలిరావాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అణగారిన ప్రజల కోసం, కార్మికుల కోసం నిత్యం పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. భవిష్యత్ కొత్త తరం నాయకులతో కలిసి పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఊరూ వాడ కదలి సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభకు రావాలని కోరారు. ఈ సభకు 40 దేశాల పైగా ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, జనార్ధన్, ప్రమీల, ఏసురత్నం, యంగల వెంకటమ్మ, యంగల కృష్ణవేణి, బరుగుల అచ్చయ్య, మాతంగి సామ్రాజ్యం, ఏసురత్నం, భవననిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం నియోజకవర్గంలో సంక్షేమ సంబురం



**- రూ. 22.20 కోట్ల సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ**
**- అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత**
**- కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/ భద్రాద్రికొత్తగూడెం :** పేదవర్గాలకు మునుపెన్నడూ లేని విధంగా పెద్దమొత్తంలో సంక్షేమ పథకాల డబ్బులు మంజూరు కావడంతో కొత్తగూడెం నియోజకవర్గంలో సంక్షేమ సంబురం నెలకొంది. 201 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాధీముభారక్ పథకంలో మంజూరైన రూ.2012 కోట్ల విలువైన చెక్కులు, అదేవిధంగా సిఎం రిలీఫ్ ఫండ్ పథకంలో 50 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 20.70 లక్షల విలువైన చెక్కులను కొత్తగూడెం క్లబ్‌లో జరిగినకార్యక్రమంలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు, ప్రజా సంక్షేమ పథకాల అమలుకు సమ ప్రధాన్యతను ఇస్తున్నామని, పార్టీలకు అతీతంగా ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌరభ్‌శర్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్‌కే. సాబీర్‌పాషా, డిప్యూటీ కలెక్టర్ పానెం క్రిష్ణ, తహశీల్దార్‌లు వనం క్రిష్ణ ప్రసాద్, దారా ప్రసాద్, సర్పంచ్‌లు, మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్‌లు, ఎంపిటిసీలు తదితరులు పాల్గొన్నారు.

# బ్రోచర్‌లను ఆవిష్కరించిన ఎంఎల్ఏ కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు సెమినార్‌లు నిర్వహించడానికి అనుమతులు రావటం అభినందనీయమని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కళాశాలలో నిర్వహించనున్ననేషనల్ లెవల్ మ్యాథమెటిక్స్, కామర్స్ సెమినార్, కంప్యూటర్ సైన్స్ సింపోజియంలకు చెందిన బ్రోచర్లను ఆయన శుక్రవారం కొత్తగూడెం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాల్వంచ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని అన్నారు. మ్యాథమెటిక్స్ సెమినార్ ఫిబ్రవరి 4, 5 తేదీలలో నేషనల్ లెవల్ కామర్స్ సెమినార్ మార్చి 9వ, తేదీ నుండి 10 వరకునేషనల్ లెవల్ కంప్యూటర్ సైన్స్ సింపోజియం ఫిబ్రవరి 12, 12 తేదీలలో నిర్వహించనున్నారని అన్నారు. విద్యాసంస్థల నుండి అకాడమిషియన్‌లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని సెమినార్‌లను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ, నేషనల్ సెమినార్‌మ్యాథమెటిక్స్ కన్వీనర్ పొట్ల పవ్వ శ్రీనివాస్, కామర్స్ సెమినార్ కన్వీనర్ పారెల్లి శ్రీనివాస్, కంప్యూటర్ సింపోషియం కన్వీనర్ కోటగిరి రాంబాబు, డి. రమేష్, వేముల కామేశ్వరరావు, దీపిక కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గుల పోటీలు...**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలు ఉట్టిపడేలా రంగురంగులతో అందమైన ముగ్గులు వేశారు. దీనితో కళాశాలలో పండగ వాతావరణం కలిగింది. విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్యాపకులు అరుణకుమారి, శెట్టి స్వరూపరాణి, ఎన్. శ్రీదేవి, నియాజ్ ఫర్వీన్, దీపిక, వకులా, లీల, సౌమ్య, తేజస్విని, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శత వసంతోత్సవ ముగింపు సభను జయప్రదం చేద్దాం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ నెల 18వ, తేదీన ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేద్దామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రానికి ముందే సిపిఐ కాన్పూర్‌లో ఆవిర్భవించినదని, స్వదేశ ఆకాంక్షను ప్రజల్లో రగిలించేందుకు పాటుపడిందని చెప్పారు. భారత స్వాతంత్ర సంగ్రామంలో అనేక మంది యువ కిషోరాలు ప్రాణ తర్పణం చేశారని ఆనాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన ఎర్రజెండా అలుపెరగని పోరాటాలు చేస్తున్నదన్నారు. ఈ వందేండ్లలో అనేక త్యాగాలు, పోరాటాల నడుమ పార్టీ ప్రయాణం సాగిందని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మద్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్న ఎర్రజెండాను ఎప్పటికి ప్రజలు ఆదరిస్తూనే ఉంటారని, పేదలు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాబోయే నూతన స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఖమ్మంలో 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు ప్రపంచదేశాల నుండి అనేక మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, సభ విజయవంతానికి మన ప్రాంతం నుండిపెద్ద ఎత్తున తరలి వెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజి, ఏఐటియుసి పట్టణ నాయకులు కంభం మెట్టు శ్రీను, జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్, భద్రాద్రి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ నాయుడు, మీసాల భాస్కర్‌రావు, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, శోభన్, రామారావు, సీతారామరాజు, వెంకటమ్మ, భాస్కర్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/చర్ల :** ఈ నెల 18న, ఖమ్మంలో జరిగే సిపిఐ జాతీయ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం చర్ల మండలంలోని తిప్పాపురం గోడపోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవాల జనవరి 18న, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రల నుండి లక్షలాది ప్రజలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్‌ఆర్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈ భారీ బహిరంగ సభకు అన్ని రాష్ట్రల నుండి సిపిఐ నాయకులు, ప్రజలు, 40 దేశాలకు చెందిన కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు జనవరి 18న, జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీపు జాతాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, సీనియర్ నాయకులు, మండల కార్యవర్గ సభ్యులు నూకా తిరుపతిరావు, పాలంచ రామారావు, పాలె సత్యారాయణ, కోడిరెక్కల రాజారావు, తిప్పపురం సర్పంచ్ నూపా సునీత, నూపా రాము, పద్దం సింగయ్య, లక్ష్మన్, రాజు, శంకర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.




# శత వసంత ముగింపు సభను జయపద్రం చేద్దాం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సిపిఐ శత వసంత ముగింపు సభను జయపద్రం చేద్దామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముస్వా వెంకటేశ్వరరావు(లడ్డా) అన్నారు. శుక్రవారం సారపాక సిపిఐ ఆఫీస్‌లో భారత గడ్డపై సిపిఐ వందేళ్ళు శతభి ఉత్సవాల ముగింపు సందర్భంగా 2026 జనవరి 18 మధ్యాహ్నం రెండు గంటలకు గొప్ప ప్రజా ప్రదర్శన, 3గంటలకు భారీ బహిరంగ సభల గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, భాస్కర్‌నగర్ శాఖ కార్యదర్శి వంకాయలపాటి నాగేశ్వరరావు, బసవ క్యాంప్ యుజన నాయకులు వహీద్, తదితరులు పాల్గొన్నారు.




# అయ్యప్ప ఆలయంలో విగ్రహ పోత కార్యక్రమం

**ప్రజాపక్షం/చండ్రుగొండ:** మండల పరిధిలోని మద్దుకూరు గ్రామ శివారులోని నిర్మాణంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధిలో శుక్రవారం విగ్రహాల అచ్చుపోసే కార్యక్రమాన్ని వేదపండితులు వివిఆర్‌కె మూర్తి సారథ్యంలో కొనసాగింది. మండల వ్యాప్తంగా గల అయ్యప్ప భక్తులు తమ వెంట వెండి, బంగారు తీసుకొచ్చి విగ్రహాల అచ్చు పట్టే కార్యక్రమంలో భాగస్వామలయ్యారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



# పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలను పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు రంగోలి ముగ్గుల పోటీ నిర్వహించడం, గాలిపటాలు ఎగురవేయడం భోగిమంటలు వేసి విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ కూడా సంతోషంగా ముందస్తు సంక్రాంతి వేడుక జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులైన శాంతకుమారి, వెంకటేశ్వర్లు, రామనాథం, ఉమామహేశ్వరి, సర్దార్ వల్లభాయ్, పటేల్ బోడా, కృష్ణ సునీత, లలిత, జివిఆర్, ప్రసాద్, శకుంతల, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల చిరుమళ్ళ, కరకగూడెం నందు అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అర్హత నుంచి మినహాయించాలని ఏఐ జేఏసి టిఓ ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం కరకగూడెం, చిరుమళ్ళ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు, ఎన్‌ఈపి 2020 రద్దు చేయాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం కాంప్లెక్స్ పే సెంటర్ ప్రధానోపాధ్యాయులు తాటి రామచంద్ర రావు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, సీనియర్ ఉపాధ్యాయులు పి. గంగరాజు, భూక్యా శేఖర్, యాలం సాయన్న, తాటి జనార్దన్, భూక్య శ్రీనివాసరావు, ఈ. సతీష్ కె. వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వర్లు. బి. రవీందర్, బి. సత్యనారాయణ డి.భీమ్ సింగ్ , టి.అశోక్, డి.నాగేశ్వరరావు, జే.బాలాజీ, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# అక్రమ రోడ్డు పనులు తక్షణమే నిలిపివేయాలి

**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్తల సొంత భూములపై కొంద మంది కాంగ్రెస్ నాయకులు అక్రమంగా రోడ్డు వేయాలనే ఉద్దేశంతో దౌర్జన్యంగా పనులు ప్రారంభించారని ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ తీవ్రంగా ఖండించింది. ఈ విషయాన్ని బాధిత రైతులు పోలీసులకు, పంచాయితీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, అధికార పార్టీ అండదండలతో బిఆర్ఎస్ నాయకుల ఆస్తులపై దౌర్జన్యం కొనసాగుతోందని బిఆర్ఎస్ పార్టీ దృష్టికి తీసుకురాగా, పార్టీ వెంటనే స్పందించింది. శుక్రవారం బిఆర్ఎస్ లీగల్ సెల్ బృందం బిచ్చాలా తిరుమలరావు ఆధ్వర్యంలో బల్లెబోయిన వలరాజు, చింతల వెంకటేశ్వర్లు, చేకూరి ముక్తేశ్వరరావులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం పంచాయితీ రాజ్ డిఈతో మాట్లాడి, పట్టాదారులైన రైతుల అనుమతి లేకుండా, అధికార పార్టీ ఒత్తిళ్లతో రోడ్డు పనులు ప్రారంభిస్తే చట్టపరమైన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను స్పష్టంగా హెచ్చరించారు. రైతులకు న్యాయం జరగకుండా అక్రమంగా పనులు చేపట్టడాన్ని బిఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



